క్లుప్తంగా

తప్పెట్లమొర్సు విద్యార్థి ప్రతిభ

గట్టు : తప్పెట్లమొర్సు విద్యార్థి ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటాడు. సంచార జాతుల్లో తోలు బొమ్మలాడించే కుటుంబానికి చెందిన బొప్పల వినోద్ ఇంటర్ ఫలితాల్లో 979 మార్కులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. సామాన్య కుటుంబానికి చెందిన వినోద్ మంచి మార్కులు సాధించడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



గట్టు: మండల పరిధిలోని మాచర్ల గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా రైతు ఖాజాబీ తన పొలంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారినట్లు వాపోయారు. ఇదే విషయమై గట్టు ఏఈకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి, విద్యుత్ తీగలను సరిచేసి, స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

రాజోళి: ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేయాలని సీపీఎం నాయకులు విజయ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. కూలీలకు అవసరమయ్యే పనిముట్లు చాలా వరకు సమకూర్చడం లేదని ఆరోపించారు. పని ప్రదేశం వద్ద కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దొంగతనం కేసులో రిమాండ్

గద్వాల క్రైం: బంగారు గొలుసు అపహరించిన కేసులో నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వేడుకకు బాధితుడు సత్యానారాయణ హాజరవగా గుర్తు తెలియని దుండగుడు 13 గ్రాముల విలువైన బంగారు గొలుసును అపహరించాడు. బాధితుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గద్వాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీసీ కెమెరాలో రైల్వే సిబ్బంది గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రానికి చెందిన నూర్‌పాషగా గుర్తించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుడు నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు చేధనలో సాంకేతిక నిపుణుడు చంద్రయ్య, సిబ్బంది కృషి ఉందని పేర్కొన్నారు.

26న మరికల్‌కు జాన్‌వెస్లీ రాక



అమరచింత: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి ఈనెల 26న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మరికల్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలంటూ నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. ఈమేరకు బుధవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో విడుదల చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఉపాధి కూలీలతో పాటు వ్యవసాయ కూలీలు, వివిధ రంగాల శ్రామికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, సీఐటీయూ సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్, సుజ్ఞానం, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

- నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ
- చలువ పందిళ్ల ఏర్పాటు



గువ్వలదిన్నెలో నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం పేరిట ప్రతి ఏటా గ్రామాల్లో మొక్క పెంపకాన్ని చేపడుతుంది. నాటిన మొక్కలను సంరక్షించడమే లక్ష్యంగా ముందుకెళ్తుంది. వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమానికి వివిధ రకాల మొక్కలు ఇప్పటి నుంచే ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్నారు. ఈ ఏడాది జనవరిలో నర్సరీలను సిద్ధం చేసి మిశ్రమ మట్టితో నింపిన ప్లాస్టిక్ సంచుల్లో విత్తనాలు వేశారు. విత్తనాలు మొలకెత్తి ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. నర్సరీల్లో మొక్కలకు ఎండ వేడిమి తగలకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా మండలంలోని 1.38 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారు. ఎండకు మొక్కలు దెబ్బతినకుండా నీటిని అందిస్తూ తగిన జాగ్రత్తలతో పాటు సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అన్ని నర్సరీల్లో గ్రీన్‌మ్యాట్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

వన సేవకులు..

నర్సరీల్లో పెంచే మొక్కలు సంరక్షించేందుకు వన సేవకులను అధికారులను నియమించారు. వనసేవకులు ప్రతిరోజు మొక్కలు నీటిని అందిస్తున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తడానికి, పెరుగుతున్న మొక్కలను రక్షించడానికి వన సేవకులు నర్సరీల్లో నిరంతరం సంరక్షణ పనులు చేపడుతున్నారు.

1.38 లక్షల మొక్కల పెంపకం

కేటీదొడ్డి మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవకులను నియమించారు. వీరు నర్సరీల్లో సంరక్షణ చర్యలు చేపడుతారు. విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో కలుపు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించడం, అదే విధంగా ఏపుగా పెరిగిన మొక్కలను ఒకచోటికి మారుస్తున్నారు. పూలు, పండ్లు ఇతర మొక్కలను నర్సరీల్లో విరివిరిగా పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 5 వేల నుంచి 6 వేల మొక్కలు పెంచుతున్నారు. మొత్తం 1.38 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

గ్రీన్‌మ్యాట్లు ఏర్పాటు చేశాం..



వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి గ్రామంలో అవసరమైన వివిధ రకాల మొక్కలు ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్నాం.

– కృష్ణమోహన్, ఎంపీడీఓ,కేటీదొడ్డి

కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు



కొండేరులో ఈనెల 16న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు(ఫైల్)



అదే కేంద్రాన్ని ఎమ్మెల్యే కంటే గంట ముందు ప్రారంభించిన నాయకులు(ఫైల్)

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో ఈనెల 16న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయుడు, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప పోటీపడి ఒకరి తర్వాత మరొకరు ప్రారంభించారు. కానీ ఇట్టి కొనుగోలు కేంద్రాలను తెరిచి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క గింజను సైతం కొనలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా పోగవుతున్నాయని వాపోతున్నారు. ఒకవైపు ధాన్యం కొనుగోలు చేయడానికి ఎన్ని రోజులు పడుతుందో తెలియకపోడవం, మరోవైపు అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ధాన్యం రాశుల దగ్గర పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు మొదలై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మండలంలో కేవలం 3 కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఏపీఎం కుర్మయ్యను సాక్షి వివరణ కోరగా రెండు కొనుగోలు కేంద్రాలకు 5వేల చొప్పున గన్నీ బ్యాగులు ఇటీవల వచ్చాయని హమాలీలు ధరలు పెంచాలని డిమాండ్ చేయడంతో కొనుగోళ్లు ప్రారంభించలేదని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి



మల్దకల్: బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం మనందరి బాధ్యతని సీడీపీఓ హేమలత, చైల్డ్‌లైన్ సభ్యులు ప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలతో పొలం పనులు చేయించడం, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆట పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, యామిని, చైల్డ్‌లైన్ సభ్యులు సురేష్, ప్రకాష్, టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఖిల్లాఘనపురం: పుస్తకాలు మనిషి జీవితానికి దారి చూపే విజ్ఞాన భాండాగారం అని ఎంఈఓ జయశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన క్లబ్ వారి నుంచి 50 మహనీయుల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం వలన వారు దేశం కోసం, సాటి మనుషుల కోసం చేసిన సేవలు తెలుస్తాయన్నారు. ఏవీఓపీఏ హైదరాబాద్ వారు అందించిన 1,500 పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ మండల కోశాధికారి రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కును బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన సోములమ్మకు రూ.15 వేల చెక్కు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు సోమనాద్రి గ్రామానికి చెందిన బోయ మహేశ్వరికి రూ.32,500, డేగ మద్దిలేటికి రూ.60వేలు విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, బీచుపల్లి, హనుమంతు, నారాయణ, తిమ్మప్పగౌడ్, సవరన్న, సిరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

భవంతిని వినియోగంలోకి తేవాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అలంపూర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రసాదం స్కీం భవంతిని వినియోగంలోకి తేవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలో ప్రసాదం స్కీంలో నిర్మించిన భవంతిని బీజేపీ నాయకులు బుధవారం సందర్శించారు. భవంతిలో నిర్మించిన భోజనశాల, వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. అలంపూర్ క్షేత్రానికి వచ్చే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మాదాయ శాఖ ఈ భవంతిని వినియోగంలోకి తేవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రసాదం స్కీంలో భాగంగా క్షేత్రానికి రూ.80 కోట్లు కేటాయిస్తే కేవలం రూ.36.72 కోట్లు మాత్రమే వినియోగించిందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న అన్నదాన సత్రంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా నిర్మించిన భవంతిని వినియోగంలోకి తెస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖరశర్మ, బీజేపీ నాయకులు రాజగోపాల్, శరత్‌బాబు, ఈశ్వర్, రంగస్వామి, నరేష్, మహేష్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

పండించిన ప్రతి గింజను కొంటాం



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. గిట్టుబాటు ధర కల్పించి రైతుకు అండగా నిలిచామని, వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి కౌలు రైతులకు అభయం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, బెక్కరి అనిత, పెద్ద విజయ్‌కుమార్, వెంకటయ్య, భాస్కర్, రాజుగౌడ్, వెంకటాద్రి, అచ్చెన్న తదితరులు పాల్గొన్నార

'చలో మహబూబ్‌నగర్' వాల్‌పోస్టర్ విడుదల

కొత్తకోట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నేతలు కలిసి పట్టణంలోని జామియామసీద్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 26న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వక్ఫ్ బిల్లును రద్దు చేసే వరకు కొనసాగించాల్సిన ప్రణాళికను, ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం యోగేంధర్

ధరూరు: ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయంటూ ఎంపీపీఎస్ పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలల హెచ్‌ఎంలు యోగేంధర్, రెహనా సుల్తానా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బడిబాట ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులచే పుర వీధుల గుండా స్థానిక వైఎస్సార్ చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యోగేంధర్ ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ప్రైవేటు పాఠశాలల మోసాలకు గురికావద్దని ర్యాలీలో విద్యార్థులు నినదించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, సీఆర్పీ నర్సింహులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బంగి హుసేనప్ప పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరం



సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఏ పీడీ సునంద



అన్నప్రాసన కార్యక్రమంలో మహిళలు

ధరూరు: పౌష్టికాహారంతోనే రక్తహీనత సమస్య దూరమవుతుందని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ సునంద అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలస్థాయి పోషణ పక్షం.. పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేపట్టారు. కార్యక్రమంలో సీడీపీఓ వెంకటేశ్వరి, సూపర్‌వైజర్లు సురేఖ, సునీత. అరుణ, పద్మావతి, ఇందిర, వీరమ్మ, నాగమణి, రజియ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి



పాతపాలెంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ధరూరు ఉన్నత పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ధరూరు: వేసవిలో విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబుల సమక్షంలో విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. వేసవి సెలవుల్లో అనవసరంగా బయట తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 180 మంది విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పాండునాయక్, కర్రెప్ప, గజేంద్ర, ప్రహల్లాద్, తన్వీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ సూచించారు. మల్దకల్, అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పొలం పనులకు తీసుకెళ్లడం వలన వారి చదువుకు ఆటంకం కలుగుతుందన్నారు. తమ చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రేవులపల్లి ఉన్నత పాఠశాలలో..

పర్యాటకులపై 'ఉగ్ర'దాడి పిరికిపంద చర్య



ఎర్రవల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న హిందూ సంఘాల నాయకులు

రాజోళి/మానవపాడు/ఎర్రవల్లి: ఉగ్రవాదులు నూటికి నూరు శాతం పిరికిపందలేనని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని బుధవారం తీవ్రంగా ఖండించారు. మతాలను ప్రామాణికంగా తీసుకుని హత్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులు చనిపోతే మానవత్వం పేరుతో విమర్శలు చేసే కొందరి నోర్లు ఇప్పుడు ఎందుకు మెదపడం లేదని మండిపడ్డారు. దాడులకు తప్పకుండా ఉగ్రవాదులు మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాడిపై ప్రధాని మోదీ తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

❑ జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మానవపాడు మండలకేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై బాధితులకు అండగా నిలవలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు రామాంజనేయులు, రాజు, తిమ్మప్ప, రాఘవయ్య, రాకేష్, లక్ష్మీనారాయణ, వెంకీ, మధు, నాగరాజు, పరుశరాముడు, బాలు, శ్రీనివాసులు, వెంకటేష్, బాబు, లోకేష్, ఉషన్ యాదవ్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

❑ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ఎర్రవల్లి మండల కేంద్రంలో వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హిందూ సంఘాల నేతలు ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు కూడలిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

❑ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ అయిజ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. వారు చేసిన ఘోరమైన చర్యకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆంజనేయులు, అశోక్, రవి, గోపి, మధు, రంగస్వామి, రాముడు, విష్ణు, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు



కొత్తపల్లిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు